# ఆకాశవాణి విజయవాడ కేంద్రం

## ప్రాంతీయ వార్తా విభాగం

## ప్రాంతీయ వార్తలు

**తేది : 25-03-2025** **సమయం : 6.45 గంటలు**

---

# ముఖ్యాంశాలు

1. **పోలవరం-బనకచర్ల అనుసంధాన ప్రాజెక్టును హైబ్రిడ్ విధానంలో చేపట్టాలని ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అధికారులను ఆదేశించారు.**

2. **శ్రీశైలం ఎడమ గట్టు కాలువ-ఎస్ఎల్బీసీ సొరంగంలో సహాయక చర్యలను ముమ్మరం చేయనున్నామని తెలంగాణ ముఖ్యమంత్రి ఏ.రేవంత్ రెడ్డి తెలిపారు.**

3. **ఆంధ్రప్రదేశ్ వ్యాప్తంగా ఉచితంగా క్యాన్సర్ స్క్రీనింగ్ పరీక్షలు నిర్వహిస్తున్నామని వైద్య ఆరోగ్య శాఖ మంత్రి వై.సత్యకుమార్ యాదవ్ పేర్కొన్నారు.**

4. **తెలంగాణలో హైదరాబాద్ స్థానిక సంస్థల ఎమ్మెల్సీ ఎన్నికకు ఎన్నికల సంఘం నోటిఫికేషన్ విడుదల చేసింది.**

5. **రైతుల సంక్షేమం కోసం ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం కృషి చేస్తోందని చేనేత, జౌళి శాఖ మంత్రి ఎస్.సవిత స్పష్టం చేశారు.**

==========================

ఆంధ్రప్రదేశ్ అరకు కాఫీ విస్తృత ప్రాచుర్యం పొందుతోందని కేంద్ర వాణిజ్య శాఖ మంత్రి పీయూష్ గోయల్ తెలిపారు. పార్లమెంట్ బడ్జెట్ సమావేశాల్లో భాగంగా.. నిన్న అరకు కాఫీ దుకాణాలను ఏర్పాటు చేశారు. ఈ దుకాణాలను లోకసభ క్యాంటీన్‌లో పార్లమెంటరీ వ్యవహారాల శాఖ మంత్రి కిరణ్ రిజిజు, రాజ్యసభ క్యాంటీన్‌లో వాణిజ్య వ్యవహారాల శాఖ మంత్రి పీయూష్ గోయల్ ప్రారంభించి మాట్లాడుతూ,

వాయిస్ .. 25 సెకన్లు

కాగా ఈ కార్యక్రమానికి గిరిజన వ్యవహారాల శాఖ మంత్రి జోయల్ ఓరం, కేంద్ర పౌరవిమానయాన శాఖ మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర గిరిజన సంక్షేమ శాఖ మంత్రి గుమ్మిడి సంధ్యారాణి తోపాటు పలువురు పార్లమెంట్ సభ్యులు పాల్గొన్నారు.

--------------------------

'పోలవరం-బనకచర్ల అనుసంధాన ప్రాజెక్టును హైబ్రిడ్ విధానంలో చేపట్టేలా ప్రణాళికను రూపొందించాలని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అధికారులను ఆదేశించారు. అమరావతిలోని రాష్ట్ర సచివాలయంలో పోలవరం-బనకచర్ల ప్రాజెక్టుపై సంబంధిత శాఖల అధికారులతో ఆయన నిన్న సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు.

ఈ సందర్భంగా చంద్రబాబు నాయుడు మాట్లాడుతూ, ఈ ప్రాజెక్టు నివేదికను కేంద్ర జలసంఘానికి త్వరగా పంపేలా చర్యలు తీసుకోవాలని అన్నారు. ఈ ఏడాది జూన్ ఒకటికల్లా టెండర్లు పిలవాలని, నాలుగేళ్లలో ప్రాజెక్టును పూర్తి చేయాలని సూచించారు.

కాగా.. ఈరోజు, రేపు అమరావతిలోని రాష్ట్ర సచివాలయంలో ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు కలెక్టర్ల సదస్సును నిర్వహించనున్నారు.

---------------------------

శ్రీశైలం ఎడమ గట్టు కాలువ–ఎస్ఎల్బీసీ సొరంగంలో సహాయక చర్యలను ముమ్మరం చేయాలని తెలంగాణ ముఖ్యమంత్రి ఏ.రేవంత్ రెడ్డి అధికారులను ఆదేశించారు. ఎస్ఎల్బీసీ సహాయక చర్యల పురోగతిపై ముఖ్యమంత్రి ఉన్నతాధికారులతో సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, సొరంగం వద్ద సహాయక చర్యల కోసం నిరంతర పర్యవేక్షణకు ఒక సీనియర్ ఐఏఎస్ అధికారిని నియమించాలని ఆదేశించారు. నిపుణుల కమిటీ సూచనలను తీసుకుంటూ కేంద్ర ప్రభుత్వం నుంచి అవసరమైన అనుమతులు తీసుకుని రెస్క్యూ ఆపరేషన్ కొనసాగించాలని సూచించారు.

ఇది ఇలా ఉండగా తెలంగాణ ముఖ్యమంత్రి ఏ. రేవంత్ రెడ్డి ఢిల్లీలో పర్యటిస్తున్నారు. పర్యటనలో భాగంగా ఆయన నిన్న రాత్రి పలువురు కాంగ్రెస్ సీనియర్ నాయకులతో సమావేశమైయ్యారు. ఈ సందర్భంగా లోక్ సభ నియోజకవర్గాల పునర్విభజన, రాష్ట్ర మంత్రి వర్గ విస్తరణ, వంటి అంశాలపై చర్చించారని పార్టీ వర్గాలు తెలిపాయి.

---------------------------

ఆంధ్రప్రదేశ్ వ్యాప్తంగా ఉచితంగా క్యాన్సర్ స్క్రీనింగ్ పరీక్షలు నిర్వహిస్తున్నామని వైద్య ఆరోగ్య శాఖ మంత్రి వై.సత్యకుమార్ యాదవ్ తెలిపారు. అమరావతిలోని రాష్ట్ర సచివాలయంలో నిన్న ఆయన పాత్రికేయలతో మాట్లాడుతూ, యువతులు, మహిళలకు బ్రెస్ట్, సర్వైకల్, ఓరల్ క్యాన్సర్ పరీక్షలు నిర్వహిస్తున్నామన్నారు. దాదాపు 4 కోట్ల 10 లక్షల మందికి స్క్రీనింగ్ పరీక్షలు చేయనున్నామని మంత్రి తెలియజేస్తూ,

వాయిస్ .. 35 సెకన్లు

---------------------------

ఆంధ్రప్రదేశ్ లో ప్రసిద్ధి పొందిన సింహాచల శ్రీ వరాహ స్వామి క్షేత్రాన్ని కూటమి ప్రభుత్వం మరింత అభివృద్ధి చేస్తోందని పర్యాటక శాఖ మంత్రి కందుల దుర్గేష్ అన్నారు. విశాఖపట్నం పర్యటనలో భాగంగా మంత్రి నిన్న సింహాచలం క్షేత్రాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా కేంద్ర ప్రభుత్వ ప్రసాద్ పథకం ద్వారా చేపడుతున్న ఆలయ అభివృద్ధి కార్యక్రమాలను పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ వచ్చే నెల ఆలయంలో జరిగే చందనోత్సవం కార్యక్రమానికి క్యూ లైన్లు, మౌలిక సదుపాయాల పనులు పూర్తి చేస్తామని, భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు.

---------------------------

తెలంగాణలో హైదరాబాద్ స్థానిక సంస్థల ఎమ్మెల్సీ ఎన్నికకు ఎన్నికల సంఘం నోటిఫికేషన్ విడుదల చేసింది. వచ్చే 23వ తేదీన ఉదయం 8 గంటల నుంచి సాయంత్రం 4 వరకు పోలింగ్ జరగనుంది. ఈమేరకు

ఎన్నికల సంఘం షెడ్యూల్ ను విడుదల చేసింది. ఈనెల 28న నోటిఫికేషన్ విడుదల కానుంది. ఏప్రిల్ 4 గంటల వరకు నామినేషన్లు దాఖలుకు గడువుగా నిర్ణయించింది. అదే నెల 7న దరఖాస్తుల పరిశీలన ఏప్రిల్ 9 వరకు ఉప సంహరణకు గడువుగా నిర్ణయించింది. ఏప్రిల్ 23న పోలింగ్, 25న ఓట్ల లెక్కింపు జరగనుంది.

---------------------------

రైతుల సంక్షేమం కోసం ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం కృషి చేస్తోందని చేనేత, జౌళి శాఖ మంత్రి ఎస్.సవిత పేర్కొన్నారు. అనంతపురం జిల్లా యల్లనూరు మండలంలోని నీర్జాంపల్లి గ్రామంలో ఆత్మహత్యకు యత్నించిన రైతులను మంత్రి నిన్న ఆసుపత్రిలో పరామర్శించారు. అనంతరం ఆమె పాత్రికేయులతో మాట్లాడుతూ ప్రకృతి వైపరీత్యం వల్ల అనంతపురం జిల్లా, వైయస్సార్ కడప, శ్రీ సత్యసాయి జిల్లాలలోనూ పంటల నష్టం వాటిల్లిందని చెప్పారు. పంట నష్టపోయిన రైతులను ప్రభుత్వం అన్ని విధాలా ఆదుకుంటుందని మంత్రి తెలుపుతూ,

వాయిస్... 28 సెకన్లు

---------------------------

ప్రపంచ వినోద పరిశ్రమకు కేంద్రంగా మారేందుకు భారత్ సిద్ధమవుతోంది. వరల్డ్ ఆడియో విజువల్ అండ్ ఎంటర్టైన్మెంట్ సమ్మిట్ - వేవ్స్ మే 1 నుండి 4వ తేదీ వరకూ ముంబైలో జరగనుంది. ఇది మీడియా రంగానికి సంబంధించిన ఒక సదస్సుగా మాత్రమే కాకుండా ప్రపంచ వ్యాప్తంగా ఉన్న కంటెంట్ సృష్టికర్తలు, రూపకర్తలు ఎలా నిమగ్నమవుతారో పునర్నిర్వచించనుంది. ప్రపంచ వినోద వేదికల కోసం, కంటెంట్ సృష్టికర్తల వ్యవస్థ కోసం కేంద్ర సమాచార, ప్రసార మంత్రిత్వ శాఖ చేపట్టిన ఈ కార్యక్రమం అత్యంత ప్రాచుర్యం పొందుతోంది.

..ప్రోమో..

---------------------------

ఇండియన్ ప్రీమియర్ లీగ్-ఐపీఎల్ లో భాగంగా అహ్మదాబాద్ వేదికగా ఈరోజు గుజరాత్ టైటాన్స్, ఢిల్లీ క్యాపిటల్స్ జట్ల మధ్య మ్యాచ్ జరగనుంది. కాగా నిన్న విశాఖపట్నం వేదికగా లక్నో సూపర్ జెయింట్స్, ఢిల్లీ క్యాపిటల్స్ జట్ల మధ్య జరిగిన మ్యాచ్‌లో లక్నోపై ఒక్క వికెట్ తేడాతో ఢిల్లీ విజయం సాధించింది. ముందుగా బ్యాటింగ్‌కు దిగిన లక్నో 20 ఓవర్లలో 8 వికెట్లకు 209 పరుగులు చేసింది.ఆ తర్వాత బ్యాటింగ్‌కు దిగిన ఢిల్లీ క్యాపిటల్స్ 19.3 ఓవర్లలో 9 వికెట్లకు 211 పరుగులు చేసి విజయం సాధించింది.

=====================